సాక్షి హనుమకొండ

శనివారం | 5 | జూలై | 2025



కేయూ పాలకమండలి సభ్యుల దిష్టిబొమ్మ దహనం

కేయూ భూములను ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ఇవ్వొద్దని పాలకమండలి సభ్యుల దిష్టిబొమ్మ దహనం చేశారు. - 8లో▸



కమ్యూనిజం ఐక్యం అనివార్యం

కమ్యూనిజం భావజాల శక్తులు ఐక్యం కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$33^0 / 25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. సాయంత్రం సమయంలో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దీప్తా, కులసుందరి క్రమాల్లో అమ్మవారికి పూజలు





హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం తొమ్మిదో రోజు అమ్మవారిని దీప్తా, కులసుందరి క్రమాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, నిత్యాహ్నికం నిర్వహించి, అనంతరం కాళీక్రమాన్ని అనుసరించి స్నపన భేరాన్ని దీప్తామాతగా, షోడశీ క్రమాన్ని అనుసరించి భోగభేరాన్ని కులసుందరిగా అలంకరించి పూజలు చేశారు. శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ ఈఓ శేషుభారతి, సిబ్బంది, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాయుధ పోరాట యోధుడు కొమురయ్య

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



హన్మకొండ అర్బన్: తెలంగాణ సాయుధ పోరాటంలో నేలరాలిన తొలి అమరుడు, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు, ఆత్మ గౌరవం కోసం తన ప్రాణాలు ఫణంగా పెట్టిన గొప్ప పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జీవితం ఆదర్శమని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి కొనియాడారు. హనుమకొండ కలెక్టరేట్‌లో శుక్రవారం కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వైవీ.గణేష్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, కార్పొరేటర్ మానస, బీసీ సంఘం నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శ్యామ్ యాదవ్, భిక్షపతి, రమేష్, ప్రకాష్, నరసింహులు, అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మరో తహసీల్దార్

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాకు తహసీల్దార్ రాణి వరంగల్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేసిన తహసీల్దార్ రాణికి పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. ఇటీవల హనుమకొండ మండల తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి మరణించడంతో ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. ఈ క్రమంలో ఆమెకు ఆ పోస్ట్ ఇస్తారా లేక మరో పోస్ట్ కేటాయిస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు

హన్మకొండ కల్చరల్: వరంగల్ మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2026 – 2027వ విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 29వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 94910 34552 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. డిసెంబర్ 13వ తేదీన ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మార్టీలో పదోన్నతి అవకాశాలు మెరుగుపర్చాలి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌ల ఎమ్మార్టీ విభాగంలో పదోన్నతి అవకాశాలు మెరుగుపర్చాలని ఎమ్మార్టీ జేఏసీ కోరింది. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంతో పోలిస్తే ఎమ్మార్టీ విభాగంగాలో పదోన్నతి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని, వీటిని పెంచాలని కోరారు. కొత్తగా మంజూరైన పోస్టులను ఎమ్మార్టీకి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ కోరికలు విన్న సీఎండీ వరుణ్ రెడ్డి సానుకూలంగా స్పందించారని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్టీ జేఏసీ ప్రతినిధులు ఆర్.రమణారెడ్డి, రజత్ కుమార్, శ్రీనివాస్, వేణు మాదవ రెడ్డి, రాజేంద్ర, భూమేష్, రత్నాకర్, శ్యాం, అనిల్ కుమార్, నాగయ్య పాల్గొన్నారు.

వీరి ప్రాణాలు.. గాలిలో దీపాలు!

కన్నీటి గాథ

విద్యుత్‌శాఖలో అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు భద్రత కరువు



- క్షేత్రస్థాయిలో కీలక విధులు.. తరచూ ప్రమాదాలు
- ఇంటి పెద్ద చనిపోవడంతో రోడ్డున పడుతున్న కుటుంబం
- గాయాలపాలై మంచానికే పరిమితమైన మరికొందరు..
- మొన్నటిదాకా వినియోగదారులకు ఇస్తున్న ఎక్స్‌గ్రేషియానే దిక్కు
- ఇటీవల బీమా సౌకర్యం కల్పించిన టీజీ ఎన్పీడీసీఎల్
- ఐటీఐ అర్హత కలిగిన వర్కర్‌కు రూ.20 లక్షలు
- ఐటీఐ లేని వారికి రూ.17 లక్షల బీమా

హన్మకొండ:

విద్యుత్‌శాఖలో క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరిస్తున్న అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న వీరు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఆదరణకు నోచుకోవడం లేదు. వీరికి ఎలాంటి సర్వీస్ రూల్స్ లేవు. ఏదైనా ప్రమాదం జరిగినా యాజమాన్యంనుంచి అందే సహాయం కూడా లేదు. వినియోగదారులకు విద్యుత్ సంబంధ సమస్యలు తలెత్తితే ముందుగా వీరినే సంప్రదిస్తారు. వీరి సమస్యలు వివరించి బాగు చేయించుకుంటారు. ఇంతటి కీలక భూమిక పోషిస్తున్న వీరికి ఆర్థిక భరోసా అందడం లేదు.

ఇటీవల బీమా సౌకర్యం..

తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తుండడంతో చలించిన టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించారు. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో మొత్తం 1,388 మంది అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు పనిచేస్తున్నారు. వీరికి గత నెలనుంచి బీమా సౌకర్యం కల్పించారు. ఇప్పటి వరకు 1300మందికి బీమా సౌకర్యం కల్పించారు. ఇందులో అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను రెండు విభాగాలుగా విభజించారు. ఐటీఐ అర్హత కలిగిన వారికి నెలకు రూ.20 వేల వేతనం, ఐటీఐ అర్హత లేని వారికి నెలకు రూ.17 వేల వేతనం అందిస్తున్నారు. ఈ మేరకు ఐటీఐ అర్హత కలిగిన అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షల బీమా, ఐటీఐ అర్హత లేని వారికి రూ.17 లక్షల పరిహారం అందేలా బీమా సౌకర్యం కల్పించారు. న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ ద్వారా వీరికి బీమా చేయించారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లాలో మృతిచెందిన అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్‌కు ఈ బీమా వర్తించే అవకాశముందని విద్యుత్ అధికార వర్గాలు తెలిపాయి.

ఆర్టిజన్లుగా గుర్తించని టీజీ ఎన్పీడీసీఎల్

రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను 2016లో విద్యుత్ సంస్థల్లోకి ఆర్టిజన్లుగా అబ్జర్వ్ చేసుకున్న క్రమంలో తెలంగాణ సౌథర్న్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎస్పీడీసీఎల్)లో పనిచేస్తున్న కట్టర్లను (ఇక్కడ అన్‌మ్యాన్ వర్కర్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్‌లను అక్కడ కట్టర్లుగా పిలిచేవారు) ఆర్టిజన్లుగా తీసుకున్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో మాత్రం అప్పటి యాజమాన్యం అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్‌లను ఆర్టిజన్‌లుగా గుర్తించలేదు. దీంతో వీరు ప్రమాదవశాత్తు మృతిచెందితే వినియోగదారులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించినట్లుగానే రూ.5లక్షలు చెల్లిస్తున్నారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురై గాయాలపాలైతే చికిత్స ఖర్చులు మాత్రం యాజమాన్యం భరిస్తుంది. కానీ, ఇది సరిగా అమలు కావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

జీవనాధారాన్ని కోల్పోయారు..





ఘటనా స్థలిలో కరుణాకర్ రెడ్డి మృతదేహం (ఫైల్)
కుటుంబ సభ్యులతో కరుణాకర్ రెడ్డి, (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన అన్‌మ్యాన్ హెల్పర్ గట్ల కరుణాకర్‌రెడ్డి గత గురువారం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి విద్యుత్ మోటారు స్టార్టర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా సర్వీస్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సుమారు 25ఏళ్లనుంచి ఆయన ఈదులపూసపల్లితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్ సేవలు అందిస్తున్నారు. కరుణాకర్ రెడ్డికి భార్య ప్రియాంక, కుమార్తె శ్రీవల్లి, కుమారుడు సుశాంత్ రెడ్డి ఉన్నారు. కుమార్తె హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతుండగా, కుమారుడు మానుకోటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కుటుంబ పెద్ద కరుణాకర్ రెడ్డి అకాల మరణంతో ఆ బాధ్యతలన్నీ భార్య ప్రియాంక మీదనే పడ్డాయి. ఈ క్రమంలో పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారంగా మారనుందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పోరాడి తనువు చాలించిన రమేశ్



కట్టర్ రమేశ్ చనిపోవడంతో రోదిస్తున్న తల్లిదండ్రులు

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన జాగిళ్లపురం రమేశ్ 2020 జూన్‌లో కొత్తపల్లిలో లైన్‌మెన్ ఆదేశాలతో ట్రాన్స్‌ఫార్మర్ తీగలను సరి చేస్తుండగా విద్యుత్ షాక్‌తో కిందపడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరాడు. డిపార్ట్‌మెంట్ నుంచి రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆస్పత్రి బిల్లులు చెల్లించారు. రమేశ్ మాత్రం కోలుకోలేదు. మంచానికే పరిమితమయ్యాడు. తల్లిదండ్రులు లక్షలు ఖర్చు చేసి ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. దీంతో తన తండ్రి ఉప్పలయ్య లేదా చెల్లెలు రజితకు ఎవరికైనా ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని పోరాడాడు. ఎమ్మెల్యేలు, మంత్రులు సహాయం చేస్తామన్నారే కానీ, ఎవరూ ఏమీ చేయలేదు. చివరికి లోకాయుక్తాలో కేసు వేసి పోరాడి 2024, అక్టోబర్ 3న చనిపోయాడు. కేసు ఇంకా లోకాయుక్తాలోనే కొనసాగుతోంది. కన్నకొడుకు చనిపోవడంతో అతడి తల్లిదండ్రులు ఉప్పలయ్య, ఆండాలు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

చేతులు కోల్పోయి రెండు నెలలుగా ఆస్పత్రిలో..



రెండు చేతులు కోల్పోయి రెండు నెలలుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తుమ్మలపల్లి రామరాజు



రామరాజు భార్య రజిత, కుమార్తెలు అఖిల, అక్షిత

దుగ్గొండి: వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రామరాజు కొన్నేళ్లుగా విద్యుత్‌శాఖలో తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వర్తించాడు. ఈ క్రమంలో గత మే 9న రైతుల వ్యవసాయ బావుల వద్ద ఓ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎర్త్‌ఫీజ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ తీగ తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఓ చెయ్యిని పూర్తిగా మరో చేయిని సగం వరకు తీసి వేశారు. రెండు నెలలుగా వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే రూ.19 లక్షల వరకు ఖర్చు అయ్యాయి. గ్రామస్తులు దాదాపు రూ.16 లక్షల వరకు విరాళాలు అందించి చికిత్స చేయిస్తున్నారు. ఇంకా చికిత్స కోసం రూ.10 లక్షలు అవసరం అవుతాయని వైద్యులు అంటున్నారని బాధితుడి భార్య రజిత తెలిపింది. పెద్ద కుమార్తె అఖిల ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువులు ఎలా కొనసాగించాలని మదనపడుతోంది. చిన్న కుమార్తె అక్షిత ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాల్సి ఉంది. ఊరు అండగా నిలిచినా ప్రయోజనం లేకుండా పోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రజిత, పిల్లలు కన్నీటిపర్యంతమవుతున్నారు.

మరికొంతమంది కార్మికుల కన్నీటి గాథలు 8లో▸

దేవాలయ భూములను స్వాధీనం చేసుకుంటాం

- దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత



వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న సునీత

ఎల్కతుర్తి: అన్యాక్రాంతమైన దేవాలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టినట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, దేవాదాయ, ధర్మాదాయ శాఖ జేవీఓ (జువెల్లరీ వెరిఫికేషన్ ఆఫీసర్) అంజనాదేవి తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయాన్ని వారు శుక్రవారం సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,062 దేవాలయాలుండగా, వాటిలో 46 దేవాలయాల నుంచి ఆదాయం సమకూరుతున్నట్లు వెల్లడించారు. 458 దేవాలయాలకు దీపధూప నైవేద్యం వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా 252 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రయోగాత్మకంగా మహబూబాబాద్ జిల్లాలోని అగస్తీశ్వర ఆలయ భూముల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పరిశీలకులు అనిల్‌కుమార్, ఈఓలు లలిత కుమారి, సులోచన, వెంకన్న, మారుతి, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే



మాట్లాడుతున్న జడ్జి క్షమాదేశ్ పాండే

ధర్మసాగర్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల సమాఖ్య సంఘాల మహిళా సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్షమాదేశ్ పాండే మాట్లాడుతూ మూడు ముళ్లతో బాలికల భవిష్యత్‌ను నాశనం చేయొద్దని హెచ్చరించారు. చదువు, క్రీడలు, సాంస్కృతిక, ఇతర రంగాల్లో వారు రాణించేందుకు ప్రోత్సాహం అందించాలని కోరారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడం బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం నేరమని అన్నారు. అందుకు సహకరించిన వారు శిక్షార్హులని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎంఈఓ రాంధన్, హనుమకొండ సీడీపీఓ విశ్వజ, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జ్ అధికారి ప్రవీణ్ కుమార్, సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ హైమావతి, ఏపీఎం అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ, జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్ కల్యాణి, ఎస్సై షైక్ జానీపాషా పాల్గొన్నారు.

చెత్త సేకరణ, తరలింపులో నిర్లక్ష్యం తగదు

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

సాక్షి ఎఫెక్ట్



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ఏదైనా వాహనం మరమ్మతుకు గురైతే ప్రత్యామ్నాయంగా మరొకటి ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యం మాత్రం చేయొద్దని అధికారులను గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. ఈ నెల 2, 3వ తేదీల్లో సాక్షి దినపత్రికలో పారిశుద్ధ్యంపై వార్త కథనాలు ప్రచురితమయ్యారు. దాంతో స్పందించిన కమిషనర్.. వరంగల్ పోతననగర్‌లోని చెత్త సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఆవరణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. తనిఖీల్లో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ మహేందర్, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఏఈలు సంతోష్ కుమార్, ఫణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంరాజ్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్



కడిపికొండ పీహెచ్‌సీలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలోని ఆయిల్ పామ్ పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించాలని అధికారులను కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ మండలాల్లో ఆయిల్ పామ్ పంట సాగు వివరాలను కలెక్టర్‌కు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటల ప్రాముఖ్యతను రైతులకు అధికారులు వివరిస్తూ అధిక విస్తీర్ణంలో సాగయ్యే విధంగా కృషి చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ఆయిల్ పామ్ పంట సాగును వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఉన్న ఆయిల్ పామ్ సాగు స్కీం ఈ సంవత్సరంతో ముగుస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెరికల్చర్‌లో ప్రగతి సాధించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉద్యాన శాఖకు సంబంధించిన బుక్‌లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనసూయ, సెరికల్చర్ అధికారులు సంజీవరావు, వెంకన్న, మండల వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

కాజీపేట అర్బన్ / మడికొండ: కాజీపేట మండలంలోని తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీ, ప్రభుత్వ పాఠశాలలను హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, పుస్తకాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాజీపేట తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, భూభారతి రెవెన్యూ సదస్సుకు వచ్చిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ భావ్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. కడిపికొండ గ్రామంలోని పీహెచ్‌సీని సందర్శించి రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. మడికొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల నమోదును ఆన్‌లైన్‌లో (ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం-ఎఫ్ఆర్ఎస్) తప్పనిసరిగా నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డీఈఓ వాసంతి, కడిపికొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదేవి, కాజీపేట ఎంఈఓ మనోజ్‌కుమార్, మడికొండ జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం సంధ్యారాణి, ఎంపీపీఎస్ హెచ్‌ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరస్వామికి శతఘటాభిషేకం



రుద్రేశ్వరుడికి అభిషేకం చేస్తున్న ఉపేంద్రశర్మ



ధాన్యంపై లింగాకారంలో ప్రతిష్ఠించిన కలశాలు

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయంలో శుక్రవారం ఉదయం రుద్రేశ్వరస్వామికి శతఘటాభిషేకం నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు గంగు మణికంఠ శర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్.. ప్రభాతసేవ, గణపతి ఆరాధన చేసి, అనంతరం ఆలయ నాట్యమండపంలో ధాన్యంపై లింగాకారంలో ఏర్పాటు చేసి వాటిపై 108 ఘటాలను (కుండలను) ప్రతిష్ఠించారు. మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం రుద్రేశ్వరుడికి శతఘటాభిషేకం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సాయినాథ దంపతుల సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరిగింది. ఏర్పాట్లను ఆలయ ఈఓ ధరణికోట అనిల్‌కుమార్ పర్యవేక్షించగా, భక్తులకు దేవాలయ సిబ్బంది మధుకర్, రజిత సేవలందించారు.

లిఫ్ట్ లేక.. మెట్లు ఎక్కలేక

- హనుమకొండ కలెక్టరేట్‌లో పనిచేయని లిఫ్ట్‌లు
- అవస్థలు ఎదుర్కొంటున్న వృద్ధులు, వికలాంగులు



లిఫ్ట్ పనిచేయకపోవడంతో మెట్ల వద్దే పడిగాపులు కాస్తున్న రామక్క

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లోని మొదటి, రెండో అంతస్తుల్లోకి వెళ్లేందుకు వృద్ధులు, వికలాంగులకు లిఫ్టే ప్రధాన ఆధారం. కొద్దిరోజుల క్రితం కలెక్టరేట్ సమీపంలోని ఒక లిఫ్ట్‌ను అధికారులు నిలిపివేశారు. తాజాగా, కలెక్టరేట్‌లో ఉన్న రెండో లిఫ్ట్ కూడా శుక్రవారం నుంచి పనిచేయలేదు. దీంతో పై అంతస్తులకు వెళ్లేందుకు వృద్ధులు, వికలాంగులు తీవ్ర అవస్థలు ఎర్కొన్నారు.

పనిచేయని లిఫ్ట్‌లు

ఆసరా ఫించన్లు, సర్వీస్ ఫించన్ల కోసం వృద్ధులు, వికలాంగులు కలెక్టరేట్ వస్తుంటారు. ఆసరా ఫింఛన్‌కు సంబంధించిన డీఆర్‌డీఏ రెండో అంతస్తులో, సర్వీస్ పెన్షన్లకు సంబంధించిన ట్రెజరీ కార్యాలయం మొదటి అంతస్తులో ఉంది. ప్రస్తుతం రేషన్ కార్డుల దరఖాస్తుల నిమిత్తం మొదటి అంతస్తులో ఉన్న పౌర సరఫరాల కార్యాలయానికి జనం భారీగా వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రెండు లిఫ్టులు పనిచేయకపోవడంతో వృద్ధులు, వికలాంగులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా లిఫ్ట్‌లు ఆపేశారా లేక ఏమైన సాంకేతిక సమస్యలు తలెత్తిందా అన్నది తెలియాల్సి ఉంది. లిఫ్ట్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

పింఛన్ కోసం వచ్చి.. పైకి ఎక్కలేకపోయా : రామక్క, సర్వీస్ పెన్షనర్

నా వయస్సు 88 సంవత్సరాలు. కాకతీయ యూనివర్సిటీ ప్రాంతం నుంచి వచ్చాను. నా భర్తకు సంబంధించిన సర్వీస్ పెన్షన్ నాకు వచ్చేది. రెండు నెలలుగా పింఛన్ రావడం లేదు. అధికారులను అడిగితే నేనే స్వయంగా వచ్చి లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలని చెప్పారు. దాంతో నేనే ట్రెజరీ కార్యాలయానికి నా కూతురును తీసుకొని వచ్చాను. ఇక్కడికి వచ్చాక పైకి వెళ్లేందుకు లిఫ్ట్ సౌకర్యం లేదు. వీల్ చైర్‌లో పైకి వెళ్లే పరిస్థితి లేదు. ఏం చేయాలో దిక్కుతోచక పొద్దటి నుంచి ఎదురు చూస్తున్నాం. తెలిసిన వారి ద్వారా ట్రెజరీ కార్యాలయానికి కబురు చేశాం. అధికారులు వచ్చి చూస్తామని చెప్పారు. ఇప్పుడు మధ్యాహ్నం అవుతున్నా వారు రాలేదు.

'బంధన్'కు షోకాజ్ నోటీస్

- ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ ఆదేశం

ఎంజీఎం: నగరంలోని బంధన్ ఆస్పత్రికి హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సదరు ప్రైవేట్ ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆస్పత్రి మేనేజ్‌మెంట్‌కు సూచించారు. షోకాజ్ నోటీస్ వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన ఎల్.కృష్ణకు బంధన్ ఆస్పత్రిలో డాక్టర్ నలిన్‌కృష్ణ గతేడాది ఫిబ్రవరి 12న అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు. అయితే, సదరు ఆస్పత్రిలో తనకు సర్జరీ చేయడంలో వైద్యుడు విఫలమయ్యాడని, దాంతో తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని వైద్య శాఖ ఉన్నతాధికారులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. మెరుగైన వైద్యం కోసం సదరు ఆస్పత్రి నుంచి హైదరాబాద్‌లోని మెడి కవర్ ఆస్పత్రికి వెళ్లగా, అక్కడ తనకు మరో సర్జరీ జరిగిందని, సుమారు 20 రోజుల పాటు వైద్యులు చికిత్స చేశారని, రూ.14 లక్షలు అక్కడ ఖర్చయ్యాయని వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా బంధన్ ఆస్పత్రితో పాటు మెడికవర్ ఆస్పత్రుల నుంచి కేస్ షీట్లను డీఎంహెచ్‌ఓ కార్యాలయం సేకరించింది. వాటి ఆధారంగా ఎంజీఎం ఆస్పత్రి నిపుణులు నివేదికను సమర్పించారు. దాని ప్రకారం బంధన్ ఆస్పత్రిలో మెడికల్ పద్ధతిలో కాకుండా రోగులకు ఓపెన్ సర్జరీ నిర్వహించినట్లు వెల్లడించారు. ఆ ప్రైవేట్ ఆస్పత్రిలో నిర్లక్ష్యం జరిగినట్లు నిపుణుల కమిటీ పేర్కొంది. దాంతో బంధన్ ఆస్పత్రికి డీఎంహెచ్‌ఓ షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

సిగాచి పరిశ్రమలో అఖిల్ మృతి..

- మృతుడిది తొర్రూరు మండలం మడిపల్లి
- వివాహమైన ఆరునెలలకే విషాదం..



అఖిల్ (ఫైల్)

తొర్రూరు రూరల్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీ అగ్ని ప్రమాదంలో తొర్రూరు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మోత్కూరి అఖిల్(29) మృతి చెందాడు. రెండు సంవత్సరాల నుంచి సిగాచి ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్న అఖిల్.. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందాడు. అయితే మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో డీఎన్‌ఏ పరీక్షలకు పంపించి అఖిల్‌గా నిర్ధారించారు. కాగా, అఖిల్‌కు ఆరు నెలల క్రితం శివరాణి అనే యువతితో వివాహం జరిగింది. ఇంతలోనే ఈ ప్రమాదం జరగడంతో భార్య శివరాణి, తల్లిదండ్రులు రాజేందర్, రాణి కన్నీరుమున్నీరవుతున్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

- భద్రత లేని విద్యుత్‌శాఖలోని అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల జీవితాలు
- క్షేత్రస్థాయిలో కీలక విధులు.. తరచూ ప్రమాదాలు
- వెట్టి చాకిరీ తప్ప ఉద్యోగ భద్రత కరువు..

వీరి ప్రాణాలు.. గాలిలో దీపాలు!



టీజీ ఎన్పీడీసీఎల్‌లో అన్‌మ్యాన్ కార్మికులుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులకు వెట్టి చాకిరీ తప్ప ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లో కూడా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు ఎక్కడం నుంచి.. నూతన లైన్ ఏర్పాటు, మరమ్మతులు, బిల్లుల వసూళ్లు తదితర అన్ని రకాల పనులు వీరితోనే చేయిస్తారు. అయినా ఈ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతోంది. ఈ క్రమంలో ఇప్పటికే 40 ఏళ్ల వయసు దాటుతుండడంతో ఉద్యోగ అర్హత కోల్పోవాల్సి వస్తోందని చాలా మంది ఆందోళన చెందుతున్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబం వీధిన పడాల్సి వస్తోంది. అయి నా పట్టించుకున్న నాథుడే కరవవుతున్నాడని పలువు రు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ఏళ్లుగా పనిచేస్తున్న అన్‌మ్యాన్ కార్మికులను పర్మనెంట్ చేసి నెలనెలా బ్యాంకు అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

మంచానికే పరిమితమైన భాస్కర్..

జఫర్‌గఢ్: విద్యుత్ శాఖలో అన్‌మ్యాన్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల షాక్‌కు గురైన తాటికాయల భాస్కర్ పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారడంతో ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడేనికి చెందిన భాస్కర్ 2012లో విద్యుత్ శాఖలో అన్‌మ్యాన్‌గా విధుల్లో చేరాడు. కొన్నేళ్ల నుంచి ఓబులాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఎల్‌సీ తీసుకుని స్తంభం ఎక్కి కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించినా భాస్కర్ నడుము భాగంతో పాటు రెండు కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. అలాగే, కుడి చెయ్యి మూడు వేళ్లను సైతం తొలగించారు. వైద్యానికి సుమారు రూ.10 లక్షలు కాగా రూ. 7 లక్షల వరకు డిపార్ట్‌మెంట్ ద్వారా ఖర్చు చేయగా మిగతా డబ్బులు బాధిత కుటుంబ సభ్యులు భరించాల్సి వచ్చింది. అయినా భాస్కర్ పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. దీంతో వారానికోసారి హెల్త్ చెకప్ కోసం వెళ్లిన సందర్భంలో రూ. 10వేల నుంచి 15 వేలు ఖర్చు అవుతోందని బాధిత కుటుంబీకులు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తే తాము ఏమి చేయలేమంటున్నారని బాధితుడి భార్య అనూష ఆవేదన వ్యక్తం చేస్తోంది. భర్తతో పాటు ముగ్గురు పిల్లల పోషణ భారం పూర్తిగా తనపైనే పడిందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటోంది.


భర్తకు సపర్యలు చేస్తున్న అనూష

శ్రీశైలం మృతితో రోడ్డున పడిన కుటుంబం..


శ్రీశైలం (ఫైల్)

పాలకుర్తి టౌన్: విద్యుత్ శాఖ అన్‌మ్యాన్ కార్మికుడు బైకాని శ్రీశైలం మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. పాలకుర్తి మండలం తీగారం గ్రామానికి చెందిన శ్రీశైలం గత సంవత్సరం ఏప్రిల్ 06న వల్మిడిలో విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురైన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుంది. శ్రీశైలం మృతి తర్వాత ప్రభుత్వం, విద్యుత్ శాఖ నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందకపోవడంతో భార్య రాణి ఇద్దరు పిల్లలతో జీవన పోరాటం చేస్తోంది. తీగారం నుంచి తన తల్లిగారి ఊరు దేవరుప్పులకు వెళ్లి ఉంటుంది. కుటుంబ పోషణకు రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది.

పిల్లల పోషణ ఇబ్బందిగా ఉంది..

నాతోపాటు నా పిల్లలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నా భర్త విధి నిర్వహణలోనే ప్రాణం కోల్పోయాడు. అయినా ఇప్పటికీ ప్రభుత్వం, విద్యుత్ శాఖ నుంచి ఎలాంటి సాయం అందలేదు. పిల్లలను పోషించుకునేందుకు ప్రభుత్వం నాకు ఉద్యోగం ఇవ్వాలి. అలాగే, ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి


పిల్లలతో శ్రీశైలం భార్య రాణి

భర్త మృతి.. తల్లిదండ్రుల వద్ద బతుకుతున్న దివ్య

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తికి చెందిన అన్‌మ్యాన్ కార్మికుడు (కట్టర్) వంచ మహేందర్‌రెడ్డి 2024, మార్చి 5వ తేదీన గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వేస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎల్‌సీ తీసుకోవడంలో జరిగిన పొరపాటుతో మహేందర్‌రెడ్డి మృతి చెందాడని, అధికారుల నిర్లక్ష్యమంటూ గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. మృతుడి భార్య దివ్యకు ఉద్యోగం, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటికి దివ్య గర్భవతి. ఉద్యోగం కోసం ఎంత తిరిగినా ఎవరు పట్టించుకోలేదు. ఇటీవలే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మాత్రమే వచ్చింది. ఉద్యోగం రాలేదు. దివ్యకు కొడుకు జన్మించడంతో పుట్టినిల్లు చేర్యాలలో బతుకుతోంది.

కన్నీటి గాథ

అంగవైకల్యమైనా నయా పైసా ఇవ్వలే..



దేవరుప్పుల: పన్నెండేళ్ల క్రితం విద్యుత్ శాఖలో అన్‌మ్యాన్ కార్మికుడిగా చేరా. 2103లో రూ.1,800 జీతంతో ప్రారంభమైన నా సర్వీస్ నేటికి రూ.13 వేల వేతనం తప్ప ఏ ఇతర సౌకర్యాలు లేవు. 2021లో దేవరుప్పుల మండలం కోలుకొండలో ఎల్‌సీ తీసుకుని పని చేస్తున్న క్రమంలో సబ్‌స్టేషన్ ఆపరేటర్ (ఉద్యోగ విరమణ పొందిన వృద్ధుడు తిరిగి విధుల్లో చేరిన వ్యక్తి) రెండు ఫీడర్ బదులు ఒక్కటే ఆఫ్ చేశారు. ఎల్‌సీ క్లియర్ అని చెప్పగానే స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా షాక్ తగిలి కింద పడ్డా. దీంతో నా చెయ్యి కాలింది. ఛాతీ పై తీవ్రగాయాలై ప్రాణపాయ స్థితిలోకి వెళ్లా. కుటుంబ సభ్యులు అప్పు చేసి సుమారు రూ.18 లక్షలు ఖర్చు చేస్తేనే బతికా. శాఖ పరంగా తిరిగి విధుల్లో తీసుకున్నారే తప్ప ప్రత్యేకించి నయా పైసా ఇవ్వలేదు. ఇతర పనులు చేయని మాకు పర్మనెంట్ చేసి తగిన పనులు అప్పగించి ఆదుకోవాలి.

– గొడిశాల వెంకటేశ్, అన్‌మ్యాన్ కార్మికుడు, దేవరుప్పుల

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం..


భార్య, పిల్లలతో క్రాంతికుమార్ (ఫైల్)

దోర్నకల్: దోర్నకల్ సబ్ స్టేషన్ పరిధిలో గత నెల 14న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తూ అసిస్టెంట్ లైన్‌మెన్ బి.క్రాంతికుమార్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మహబూబాబాద్ జిల్లా నర్సింహపేటకు చెందిన బోగి నర్సయ్య, ఇందిర దంపతుల పెద్ద కుమారుడు క్రాంతికుమార్ ఏడేళ్ల క్రితం విద్యుత్‌శాఖలో చేరి దోర్నకల్‌లో విధులు నిర్వహిస్తూ చనిపోయాడు. 2019లో క్రాంతికుమార్‌కు వంశీలతతో వివాహం జరిగింది. ఈ దంపతులకు నాలుగేళ్లు, రెండేళ్ల కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో క్రాంతికుమార్ మృతితో తల్లిదండ్రులతోపాటు తన పిల్లలు, భార్య రోడ్డున పడ్డారు. కాగా, తండ్రి కనిపించకపోవడంతో చిన్నారులు నిత్యం నాన్న.. నాన్న అంటూ క్రాంతికుమార్‌ను కలువరిస్తున్నారని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అనుమతుల కోసం అడ్డదారులు

- డబ్బులు ముట్టజెప్పిన 'వరంగల్ ఫాదర్ కొలంబో'
- ట్రస్టీ కొమ్మారెడ్డి జోసెఫ్‌పై సీబీఐ కేసు నమోదు



కాజీపేట రూరల్: నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) స్కామ్‌లో వరంగల్ హంటర్‌రోడ్డు బ్రిడ్జి సమీపంలోని ఫాదర్ కొలంబో మెడికేర్ ఆస్పత్రి (ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) పాత్ర సంచలనం రేపుతోంది. అధికారిక అనుమతుల కోసం డబ్బులు ముట్టజెప్పినందుకు వరంగల్‌కు చెందిన ఫాదర్ కొలంబో మెడికల్ కళాశాల ట్రస్టీ కొమ్మారెడ్డి జోసెఫ్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. మెడికల్ కళాశాల తనిఖీల్లో ఎన్‌ఎంసీ అధికారులు అనుకూలంగా నివేదికలు ఇచ్చేందుకు మధ్యవర్తులకు జోసెఫ్ లంచాలు ఇచ్చినట్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ స్కాంలో తేలింది. దేశవ్యాప్తంగా 36 మందిపై సీబీఐ కేసులు నమోదు చేయగా, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఐదుగురిలో వరంగల్‌కు చెందిన జోసెఫ్‌పై కేసు నమోదైంది. మెడికల్ కళాశాల క్లియరెన్స్, అధికార అనుమతుల కోసం మధ్యవర్తులకు రూ.20 లక్షలు, రూ.46 లక్షల చొప్పున రెండుసార్లు జోసెఫ్ ముట్టజెప్పినట్లు తేలింది. ఈ విషయమై వివరణ కోసం ట్రస్టీ కొమ్మారెడ్డి జోసెఫ్‌కు శుక్రవారం రాత్రి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ తనిఖీ


స్టేడియాన్ని తనిఖీ చేస్తున్న రైల్వే ఏపీఓ జితేంద్రకుమార్ బృందం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌ను శుక్రవారం సికింద్రాబాద్ డివిజన్ అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ (ఏపీఓ, ఇంజనీరింగ్ విభాగం) జితేంద్రకుమార్ బృందం తనిఖీ చేసింది. రైల్వే ఇన్‌స్టిట్యూట్, కమ్యూనిటిహాల్, స్టేడియాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసింది. ఇన్‌స్టిట్యూట్ నిర్వహణ, రికార్డులు, మెంబర్‌షిప్ వివరాలు, సౌకర్యాలు, సదుపాయాలను తనిఖీ చేశారు. ఇన్‌స్టిట్యూట్ బాయ్స్ వివరాలు, వేతనాలు అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీహాల్ నిర్వహణ బాగుందని అభినందించారని ఇన్‌స్టిట్యూట్ ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వర్‌రావు తెలిపారు. తనిఖీలో రైల్వే వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఓఎస్ సత్యనారాయణ ఉన్నారు.

కమ్యూనిజం శక్తుల ఐక్యం అనివార్యం

- విముక్తి పోరుకు స్ఫూర్తిప్రదాత దొడ్డి కొమురయ్య
- కార్పొరేట్ కోసమే ప్రకృతి సంపద దోపిడీకి యత్నం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

దేవరుప్పుల : పీడిత ప్రజానీకం కోసం నిత్యం పాటుపడే విప్లవ పార్టీలను అంతమొందించేందుకు ప్రధాని మోదీ చేస్తున్న కుట్రలను ఛేదించేందుకు కమ్యూనిజం భావజాల శక్తులు ఐక్యం కావడం అనివార్యమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్తూపం, విగ్రహానికి నారాయణతోపాటు అరుణోదయ స మాఖ్య వ్యవస్థాపకులు విమలక్క, ఎంసీపీఐ రాష్ట్ర నాయకుడు కుమారస్వామి, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొమురయ్య స్మారక భవనంలో జరిగిన సంస్మరణ సభకు సీపీఐ మండల కార్యదర్శి జీడీ ఎల్లయ్య అధ్యక్షత వహించగా నారాయణ మాట్లాడారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకృతి సంపదను కొల్లగొట్టేందుకు డెడ్ లైన్ పేరిట సరిహద్దు సైన్యాన్ని అంతర్గతంగా వినియోగిస్తూ కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తున్నారని విమర్శించారు. ఇదే మణిపూర్‌లో సాయుధ పంథాను అణిచివేయకుండా చూడడంలోనే వారి స్వార్థ పాలన వెల్లడైందన్నారు. న్యాయ వ్యవస్థను కించపరిచే పాలకులు రాజ్యాంగాన్ని మార్చలేరని హితవు పలికారు. నిజాం పాలనలో దొడ్డి కొమురయ్య పోరాట పటిమతోనే సాయుధ పోరాటం ఆవిర్భవించిందన్నారు. దీనితోనే బానిసత్వం, దున్నేవాడికి భూమితోపాటు భూస్వామ్య విధానం రద్దు అయ్యిందన్నారు. నేటికీ విస్నూర్ దేశ్‌ముఖ్ మూలాలకు చెందిన ప్రొఫెసర్ పాండురంగా రావు.. సాయుధ పోరాటాన్ని కించపరిచే వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వానికి అద్దం పడుతున్నాయన్నారు. ఎర్రజెండా ద్వారానే అన్ని వర్గాల ప్రయోజనాలు సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్ల నర్సింహులు వారసురాలు చింతకింది అరుణక్క, సీపీఐ జిల్లా కార్యదర్శి సి.హెచ్. రాజారెడ్డి, రాష్ట్ర నాయకులు విశ్వేశ్వర్‌రావు, సుగుణమ్మ, సాయన్న, సొప్పరి సోమయ్య, బిల్లా తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, ఎల్లయ్య, ప్రశాంత్, సుజిత్, సోమనారాయణ, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

అభిషేక్ సూత్రపు రిమాండ్..

- రూ.14 లక్షలు స్వాధీనం చేసుకున్న తిరుపతి పోలీసులు
- జిల్లాలో చర్చనీయాంశమైన గాయకుడి అరెస్ట్

కాజీపేట: హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణానికి చెందిన అభిషేక్ సూత్రపు అనే గాయకుడిని ఏపీలోని తిరుపతి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. చిన్న వయసులోనే ఎన్నో ఆలయాల్లో ప్రదర్శనలు ఇచ్చి మంచి పేరు దక్కించుకున్న అభిషేక్ తప్పుడు మార్గంలో పయనించి పోలీసులకు చిక్కి కటకటాల పాలుకావడం జిల్లాలో చర్చగా మారింది. ఆధ్యాత్మిక గాయకుడిగా పేరున్న అభిషేక్ ఇటీవల శ్రీశ్రీనివాస్ కళార్చన పేరుతో 93 కళా బృందాలను ఏర్పాటు చేసి 2,900 మంది వద్ద నుంచి రూ.39 లక్షల వరకు వసూలు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. టీటీడీ హిందూ ధర్మ ప్రచార సంస్థ అనుమతి లేకుండా డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో స్పందించిన అధికారులు విజిలెన్స్ విచారణకు ఆదేశించగా నిజమేనని తేలింది. కళాబృందాలకు రెండు రోజులు తిరుమలలో ప్రోగ్రాంలతో పాటు వేంకటేశ్వర స్వామి వారి దర్శనాలు, లడ్డూ ప్రసాదాల పేరుతో కూడా వసూళ్లకు పాల్పడినట్లు అధికారులు గుర్తించి అభిషేక్‌ను ముందస్తుగా అదుపులోకి తీసుకుని రూ.14 లక్షలు స్వాధీనం చేశారు. అనంతరం నిందితుడిని గురువారం తిరుపతి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించినట్లు తెలియడంతో అభిషేక్ బంధు, మిత్రులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

నేషనల్ మీట్‌లోనూ సత్తా చాటాలి


పతకాలు సాధించిన పోలీస్ అధికారులతో సీపీ సన్‌ప్రీత్ సింగ్

- సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: జోనల్ డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు.. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న భద్రాద్రి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ శుక్రవారం ముగిసింది. జోనల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు, మహబుబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు పలు విభాగాల్లో పోటీపడ్డారు. ప్రతిభ కనబరిచిన వారికి సీపీ పతకాలు అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగానికి 15 గోల్డ్ మెడల్స్‌తో సహా మొత్తం 31 పతకాలు వచ్చాయి. అలాగే, భద్రాద్రి కొత్తగూడెంకు 19, మహబూబాబాద్ జిల్లాకు 17, ఖమ్మం జిల్లా అధికారులు 5 పతకాలు సాధించినట్లు నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ సాధన చేస్తే వృత్తి నైపుణ్యంతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చవచ్చని అన్నారు. పోటీల విజయవంతానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ప్రభాకర్‌రావు, బోనాల కిషన్, వరంగల్ ఏఎస్పీ శుభం, ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ స్నాతకోత్సవ రిహార్సల్స్


రిహార్సల్స్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, తదితరులు

కేయూ క్యాంపస్: ఈ నెల 7వ తేదీన జరగనున్న కేయూ స్నాతకోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రిహార్సల్స్ చేశారు. పలువురు పాలకమండలి సభ్యులు, వివిధ విభాగాల డీన్లు, కమిటీల కన్వీనర్లు, సభ్యులు, ఇతర అధికారులు స్నాతకోత్సవ రిహార్సిల్స్ చేశారు. కొందరు విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్ మెడల్స్ ప్రదానంపై కూడా రిహార్సల్స్ చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రిహార్సల్స్ ద్వారా లోటు పాట్లు తెలుసుకుని స్నాతకోత్సవాన్ని విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వి. రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

6న కేయూకు పనిదినం..

ఈ నెల7వ తేదీ కేయూ స్నాతకోత్సవం నేపథ్యంలో 6న (ఆదివారం) అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులకు వర్కింగ్ డేగా పరిగణిస్తూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. ఈ రోజుకు బదులు అక్టోబర్ 4వ తేదీని సెలవు దినంగా ప్రకటించారు. కాగా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్యాంపస్‌లోని పలు చోట్ల క్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

డిజిటల్ అరెస్ట్ మోసం..

- రూ.7.70 లక్షలు పోగొట్టుకున్న దంపతులు
- ఆధార్ నంబర్‌తో కేసు నమోదైందని బెదిరింపులు

మహబూబాబాద్ రూరల్ : డిజిటల్ (ఆన్‌లైన్) అరెస్ట్ పేరిట జరిగిన మోసంతో బాధితులు రూ.7.70 లక్షలు పోగొట్టుకున్న ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తికి కొంతమంది అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీ ఆధార్ కార్డుతో వేరే వాళ్లు ఫోన్ సిమ్‌లు తీసుకుని అమ్మాయిలను వేధిస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఆధార్ నంబర్‌తో హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారని, మీపై ఎఫ్ఐఆర్ నమోదైందని చెప్పిన అపరిచిత వ్యక్తులు.. సదరు వ్యక్తికి వీడియో కాల్ చేసి గత నెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మాట్లాడారు. అదే విధంగా ఆయన భార్యతోనూ ఫోన్ కాల్స్ మాట్లాడగా వారు భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఆ వీడియోలో సైబర్ నేరగాళ్లు పోలీసు స్టేషన్, పోలీసు అధికారుల మాదిరి కొందరు వ్యక్తులను చూపించి భార్యాభర్తలను బెదిరించారు. ఆ కేసు పరిష్కారం కావాలంటే కొంత నగదును పంపించాలని చెప్పగా నమ్మిన భార్యభర్తలు గత నెల 30వ తేదీన తమ బ్యాంకు ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్ల ఖాతాలకు రూ.7.70 లక్షలు బదిలీ చేశారు. ఈ ఘటన నిజమేనా అని తమ కుటుంబ సభ్యులతో చెప్పగా వారు పరిశీలించి డిజిటల్ అరెస్ట్ ప్రకటన మోసమని గుర్తించి వెంటనే సైబర్ క్రైం నంబర్ 1930లో ఫిర్యాదు చేసి ఆ విషయంపై మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఎవరైనా ఆన్‌లైన్ అరెస్ట్, ఇతర మాటలు చెబుతూ భయపెడితే అలాంటి వ్యక్తుల మాటలు నమ్మొద్దని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. అలాంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే సైబర్ క్రైం నంబర్ 1930లో ఫిర్యాదు చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రైతుకు పాముకాటు

దంతాలపల్లి : ఓ రైతు పాముకాటుకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని వేములపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండగాని వెంకన్న ఉదయం తన పొలంలో నీళ్లు పెట్టి గట్లు వేస్తున్నాడు. ఈ క్రమంలో తన కాళ్లు, చేతులకు అంటుకున్న బురదను శుభ్రం చేసుకునే సమయంలో పాము కాటు వేసింది. గమనించిన రైతు.. కుటుంబ సభ్యులతో కలిసి మండలకేంద్రంలోని ఆస్పత్రికి వచ్చాడు. వైద్యురాలు కవిత, ఏఎన్ఎం కవిత చికిత్స అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాము, తేలు కాటు విషానికి ఆస్పత్రిలో విరుగుడు (ఇంజక్షన్) ఉందన్నారు. తేలు, పాముకాటుకు గురైన మండల ప్రజలు సొంత వైద్యం చేసుకోకుండా వెంటనే ఆస్పత్రికి రావాలన్నారు.

కేయూ పాలకమండలి సభ్యుల దిష్టిబొమ్మ దహనం

- ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూములు ఇవ్వొద్దని డిమాండ్


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూములను యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి యూనివర్సిటీ పాలకమండలి ఆమోదించిందని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎఫ్‌డీఎస్, డీఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, బీఆర్ఎస్వీ, బీఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఎస్ఎస్‌యూ, ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో శుక్రవారం కేయూలో పాలకమండలి సభ్యుల శవయాత్ర నిర్వహించారు. హ్యూమనిటీస్ భవనం నుంచి పరిపాలన భవనం వరకు శవయాత్రను నిర్వహించి అక్కడ పాలకమండలి సభ్యుల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు మాట్లాడుతూ పలు చోట్ల కేయూ భూములు కబ్జాకు గురయ్యాయని, వాటిని వెనక్కితీసుకోవాలనే విషయంపై దృష్టిసారించకుండా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు 15ఎకరాల భూమిని కేటాయిస్తూ పాలకమండలి సభ్యులు ఆమోదించడం శోచనీయమన్నారు. పాలకమండలి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు గడ్డం నాగార్జున, రాష్ట్ర సావిత్రి, కామగోని శ్రావణ్, మున్నా గణేశ్, మంద శ్రీకాంత్, స్టాలిన్, కల్యాణ్, మర్రి మహేశ్, సాయికుమార్, బైరపాక ప్రశాంత్, కమ్మరపెల్లి శివ, మధు, అన్నమయ్య, సాయి, జశ్వంత్, రాజు, నరేశ్, సురేశ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

- స్టేషన్‌ఘన్‌పూర్ మెయిన్‌రోడ్ బిట్ 1/2 ఎకరం (20 గుంటలు) వ్యవసాయ భూమి అమ్మబడును. Hyd హైవే నుండి 6 KM పాంనూర్, Beside కాటన్ ఆయిల్ ఫ్యాక్టరీ. Cell: 9963043031, 8247785101. [SCA25005829]

SERVICES

- శివబాలాజీ లోన్స్: స్లాబు, పెంకుటిల్లు, రేకుల కప్పు, అగ్రికల్చర్ లోన్స్, అన్నిరకాల వ్యాపారులకు లోన్స్, భవన నిర్మాణ కార్మికులకు Topup లోన్స్ ఇవ్వబడును. వరంగల్- 8522825358. [WA-6722]
- పద్మావతి ఫైనాన్స్: హౌసింగ్ బిజినెస్ మార్టిగేజ్ పర్సనల్ ఓపెన్ ప్లాట్స్ పై రుణాలు ఇప్పించబడును. IT రిటర్న్స్ GST లైసెన్స్ చేయబడును. WGL. 9618767116. [SCA25005682]

CHANGE OF NAME

- I, **Jarupula Charan,** S/o: Jarupula Thirupathi (New Name), R/o. H.No.2-26, Mangal Thanda, Geesugonda mdl. Nandanayak Thanda, Warangal Dist, Telangana State - 506331. I have changed my name from Jarupula Pandu (Old Name) to **Jarupula Charan** (New Name) for all purposes. [SCA25005930]

BUSINESS OFFER

- అధిక ఆదాయం కోసం ఎదురు చూస్తున్నారా! మీ సొంత ఇంటర్నేషనల్ క్యాపిటల్ మీ ట్రేడింగ్ అకౌంట్లో సంపాదించండి. ప్రాఫిట్ షేరింగ్ ఫిక్సడ్ రిటన్ సేఫ్ & సెక్యూర్. 6301859174. [SCA25005799]
- ITR / Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [HA-480]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

- **Wanted Drivers:** భవాని ఖార గొర్రెకుంటలో పని చేయుటకు DCM & బొలెరో డ్రైవర్స్ కావలెను. Phone call Timings 11 AM to 6PM. Cell: 9396991649. [SCA25005762]
- **Wanted Special Educator.** B.Ed, HI for a School - JACKSON MISSION SCHOOL. Contact: 8885800489, 7075102777. [SCA25005897]
- **1) Bolero Car Driver Cum Shop Keeper** (Both Works) Sal: 10K-14K. Age: 30-45yrs, 2) Sales & Delivery Boys, 3) Helpers & Machine Operators (Q: 10th, Inter, ITI. 8K to 10K. Cont: Veghan Naturals, IP Rampur, Kazipet. Cell: 9919911016 [WA-6724]
- రామకృష్ణ ఓల్డేజ్‌హోం నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబికేర్ కై M/F వర్కర్స్ కా॥. బో+వసతి + జీతం: 16-18 వేలు ఏజెంట్లకు 5వేలు కమీషన్ ఫోన్: 9281465319, 9010680011 [SCA25005822]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. Ph: 9848571888, 9640400073. [SCA25005909]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.